క్లుప్తంగా

గురుకులానికి బ్లీచింగ్ పౌడర్ అందజేత



బ్లీచింగ్ అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కాసాగార్డెన్‌లో ఉన్న బాలికల గురుకుల పాఠశాలకు దాతలు శుక్రవారం బ్లీచింగ్ వితరణ చేశారు. పరిసరాల శుభ్రత, దోమల నివారణ నిమిత్తం పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ భార్గవమూర్తి, పాత్రికేయుడు సుబ్బారావు, రఘుగురుకుల్ ఏడాదికి సరిపడే రెండు బస్తాల బ్లీచింగ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తప్పనిసరి



పల్లంలో మాట్లాడుతున్న రత్నమ్మ

ఏర్పేడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని గర్భిణులు, పిల్లలు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని సూపర్‌వైజర్ రత్నమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లం, పల్లంపేట, ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మహోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బలవర్ధకమైన పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లోని పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, హసీనా, గోవిందమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వర్షంతో అపార నష్టం




నేలకొరిగిన వరి పంట

ఏర్పేడు: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటకు కోత దశలో అపార నష్టం జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్ల ద్వారా సుమారు 6 వేల ఎకరాల్లో ఆర్ఎన్ఆర్, బుడ్డలు, 1010 తదితర రకాల వరి సాగు చేశారు. గత రబీసీలో ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడంతో ఖరీఫ్‌లో కూడా లాభాలు ఉంటాయని ఆశతో ఈ సీజన్‌లో ఎక్కువగా వరి సాగు చేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని ఏర్పేడు, కోబాక, అంజిమేడు, కందాడు, గుడిమల్లం, వికృతమాల, సీతారాంపేట, పాతవీరాపురం, ఎండీపుత్తూరు, ఇసుకతాగేలి, పల్లం, రాజులపాళెం తదితర గ్రామాల్లో సుమారు 500 ఎకరాలకు పైగా వరిపంట నేలకొరిగి దెబ్బతింది. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి పంట నష్టపరిహారం పంపిణీకి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా గ్రామోత్సవం

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం రాత్రి అమ్మవారు సముదాయం, కీళగరం, నారాయణవనం వీధుల్లో విహరించారు. అర్చకులు ఉదయం ఆలయాన్ని తెరచి నిత్య పూజా కైంకర్యాలు పూర్తి చేసి, అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. పరిసర గ్రామాల మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని మహిషాసురమర్దినిగా పుష్పపల్లకిలో కొలువుదీర్చి సముదాయం, నారాయణవనం, కీళగరం గ్రామాల్లో ఊరేగించారు. కార్యక్రమాల్లో టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, అర్చకులు పన్నీర్ సెల్వం పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి



యూనిఫారమ్ అందజేస్తున్న సుబ్రమణ్యం

ఏర్పేడు: పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేద్దామని మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వంద మంది విద్యార్థులకు తన సొంత నిధులతో ఉచిత యూనిఫారమ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్థిక స్థోమత లేక చాలామంది తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమ వంతుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. మరింత మంది దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వెంకటసుబ్బమ్మ, అధ్యాపకులు శ్రీమన్నారాయణ, రామాంజులు, రాఘవరెడ్డి, ఉమ, సువర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంటుకు ఆయువు

మునస్వామి



అంటు కట్టిన మొక్కను పరిశీలిస్తున్న మునస్వామి



తమలపాకు తీగకు అంటుకట్టిన మిరియాల తీగ

ఆయన పెద్ద పెద్ద వ్యవసాయ డిగ్రీలు పుచ్చుకోలేదు.. గ్రంథాలు చదవలేదు. ఆయనో నిరక్షరాస్యుడు.. పండ్ల తోటల కాపలాదారుడు. అయితే నేమీ ఆసక్తి ఉండాలే కానీ.. ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు. మొక్కల రూపాంతరంపై పరిశోధనలు చేశాడు.. మొక్కలకు పలు కొత్త మొక్క ల అంట్లు కట్టడంలో నిపుణత సంపాదించాడు. ఆధునిక రకాలు సృష్టించి, విజయం సాధించాడు. ఒకే మొక్కలో పలు రకాల ఫలాల దిగుబడికి కృషి చేశాడు. మొక్క అంటుకు ఆయువు పోశాడు. నేడు పలు ప్రాంతాలకు వెళ్లి అంట్లు కట్టి వస్తున్నాడు. ఆయనే మదనంబేడు దళితవాడకు చెందిన మునస్వామి.

- మొక్కకు అంటు కట్టడంలో దిట్ట
- పలు కొత్త మొక్కజీ సృష్టించిన మునస్వామి

సత్యవేడు: మండలంలోని మదనంబేడు దళితవాడకు చెందిన నిరక్షరాస్యుడు, రైతుకూలీ అయిన మునస్వామి మొక్కల అంటు కట్టేపనిలో నైపుణ్యం కలిగి ఉండడంతో పండ్లు, పూల తోటల సాగు చేస్తున్న రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. అతనికి చెట్లు అంటే ప్రాణం, ఆ మమకారంతోనే పూలతోటలు, మొక్కలు నాటే పనులకు వెళ్లేందుకు ప్రాధాన్యత ఇచ్చేవాడు. నేడు ఒక చెట్టు నుంచి, ఒక మొక్క నుంచి అంటు కట్టే విధానం ద్వారా వందల రకాల మొక్కలు ఎలా సృష్టించాలో తెలుసుకొన్నాడు. కొన్ని సంవత్సరాలుగా వందల సంఖ్యలో ఆధునిక రకాల మొక్కలను సృష్టించి, ఇంటి ఆవరణలో నాటి పెద్దవయ్యేలా ప్రయోగాలు చేస్తున్నాడు. మామిడి రైతులు అంటు కట్టుకుని కొత్తరకం పండ్ల తోటల సాగుకు చేయలని మునస్వామి కోరుతున్నాడు.



దానిమ్మకు కట్టిన రెండు రంగుల ఫలాల అంట్లు

చెట్టు ఒకటే.. పండ్లు నాలుగు రకాలు

మామిడిలో నాలుగు నుంచి ఏడు రకాలు ఒక కొమ్మకు బంగిన పల్లి, మరో కొమ్మలో రుమానీ, ఇంకో కొమ్మకు తోతాపురి, ఇతర కొమ్మలో మల్గూబ తదితర రకాలు కాపు వచ్చేలా అంటు కడుతున్నాడు. మండలంలోని రాజుల కండ్రిగకు చెందిన ఒక రైతు ఇంటి ఆవరణలో ఒక చెట్టుకు వివిధ రకాలు కాయలు కాస్తున్నాయని ఆయన తెలిపారు. పెద్ద పెద్ద మామిడి చెట్లు సరిగా కాయలు కాపు కాయక పోవడంతో రైతులు మొక్కల మొదలు తొలించే అభిప్రాయం వచ్చే రైతులకు సలహాలు ఇస్తూ చెట్టు మొదలు ఒక మీటరు వరకు కొమ్మలు తొలగించి, రైతు కోరిన రకం మామిడి అంటు కట్టిస్తున్నాడు. రైతులకు పెట్టుబడి భారం పడకుండా ఉన్న చెట్టుకే మరో రకం ఫలాలను అందించేందుకు దోహదపడుతున్నాడు. చెట్లు నరకడం ద్వారా పర్యావరణానికి నష్టం కలుగుతుందని, మీకు ఇష్టం లేని చెట్లు ఉంటే నరకకుండా తనకు చెబితే వాటి స్థానంలో మీకు ఇష్టమైన చెట్టును పెంచుకోవచ్చని అంటు కట్టి నిరూపిస్తున్నాడు.

మొక్కలు అంటు కట్టే పనే నేడు జీవనాధారం

చిన్నతనం నుంచి మామిడి తోటల కాపాలకు వెళ్లేవాడు, చిన్నతనంలో ఇతరప్రాంతాల్లో చెట్టుకు అంటు కట్టే వారు వస్తే అక్కడి కెళ్లి చూస్తూ సొంతంగా చెట్లకు అంటు కట్టడాన్ని నేర్చుకున్నాడు. తొలుత ఇంటి వద్దే చెట్టుకు అంటుకట్టం మొదలెట్టాడు. అలా మొదలైన ప్రయాణం చెట్లకు అంటు కట్టడంతో తనకు తానే సాటి అన్నరీతిలో ముందుకు సాగాడు.

పలు రకాల అంట్లు

తమలపాకు తీగకు మిరియాలు తీగ అంటు కట్టి మిరియాలు పండిస్తున్నాడు. మామిడిలో ఏడు రకాలు, దానిమ్మలో తెలుపు, ఎరుపు రకం, నేరేడులో హైబ్రీడు నేరేడు రెండు రకాలు, కమలా చెట్టుకు ఆరంజి అంటుకడుతున్నాడు. మునగ మొక్కకు మూడు రకాలు హైబ్రీడు మొక్కల సాగు, పూలు మొక్కలలో మందార మొక్కకు 8 రకాలు అంటు కడుతున్నారు.

పలు ప్రాంతాల్లో అంట్లు కట్టా

నెల్లూరు జిల్లాలోని తడ, సంతవేలూరు, అంబూరు. తమిళపాడులోని చెంగల్పట్టు, సత్యవేడు మండలంలో వీఆర్ కండ్రిగ గ్రామాల వెళ్లి అంట్లు కట్టి వచ్చానని ఆయన తెలిపారు.

అతి తక్కువ ధరకే అంట్లు

అతి తక్కువ ధరలకే చెట్లుకు అంటు కట్టి హైబ్రీడ్ చెట్లు నాటుతున్నారు. సత్యవేడు మండలంలోనే కాకుండా తమిళనాడు, నెల్లూరు జిల్లాలో కూడా అక్కడి రైతులు పిలవడంతో వెళ్లి అంట్లు కట్టి వస్తున్నారు. ఈ పనిని చెట్లు మీద ప్రేమతో చేయడంతో రైతులు వద్ద నుంచి నామమాత్రపు నగదును తీసుకుంటున్నారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

సత్యవేడు: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్–24) జరుగుతోందని, ఓటర్లు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్, ఆఫీసర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.రామమోహన్ కోరారు. శుక్రవారం సత్యవేడు రెవెన్యూ కార్యాలయంలో అఖిల పక్ష పార్టీ నాయకులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆగస్టు 21నుంచి సెప్టెంబరు 21వతేదీ వరకు బూత్‌స్థాయి అధికారులు(బీఎల్వోలు) ద్వారా ఇంటింటా జాబితాల పరిశీలన చేపడుతున్నారన్నారు. కొత్త ఓటర్ల నమోదు, మృతులు, డబుల్ ఎంట్రీ ఓటర్లు తొలగించడం, సక్రమంగా లేని ఫొటోలు సరిదిద్దడం, చిరునామాలు, పేర్లలో తప్పులను సవరిస్తారన్నారు. సవరణ చేయడానికి వీలుగా ఫారం 6, 7, 8ను అందిస్తారన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు సవరిచుకోవడానికి ఇదో మంచి అవకాశం అన్నారు. రాజకీయనాయకులు, స్వచ్ఛంద సంస్థలు స్పందిస్తే తప్పులేని ఓటర్ల జాబితా తయారవుతుందన్నారు. అక్టోబరు 29న ముసాయిదా జాబితాను విడుదల చేస్తారన్నారు. డిసెంబరు 24 వరకు అభ్యతరాలను పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మునికృష్ణయ్య, మోహన్‌బాబు, వెంకటేశ్వర్లు, తెలుగుదేశం నాయకులు దిలీప్, సీపీఎం నాయకులు విగ్నేష్, డీటీ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

రూ.5వేల కోట్లు మంజూరు చేయాలి

శ్రీకాళహస్తి: వరద బాధితులకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.5 వేలు కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి మోదీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధానమంత్రి మాత్రం సింగపూర్‌లో షికార్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో రాష్ట్రానికి నాలుగు ప్రాజెక్టు తీసుకువచ్చామన్నారు. నిరుద్యోగ సమస్య నిర్మూలనకు బెల్ ప్రాజెక్టు ఏర్పాటు చేశామన్నారు. నడికుడి రైల్వే ప్రాజెక్టు, అంతర్జాతీయ విమానాశ్రయం తదితరాలు తమ హయాంలోనే తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కూడా వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. టీటీడీ రూ.10 కోట్లు, శ్రీకాళహస్తీశ్వరాలయం రూ.5 కోట్లు అందించి వరదబాధితులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రావణన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి బాధాకరం

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వి.సుబ్రమణ్యం (70) మృతి బాధాకరమని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. మాజీ సర్పంచ్ మృతి సమాచారం అందుకున్న రాజేష్ పార్టీ శ్రేణులతో కలసి శుక్రవారం ఉదయం పెద్ద పాండూరుకు చేరుకుని మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం మృతదేహాన్ని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మాజీ పాలక మండలి సభ్యులు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కో–కన్వీనర్ శోభన్ యాదవ్, సీనియర్ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, పార్టీ నాయకులు చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, మహేంద్ర, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, దుద్దు వేణు, మునస్వామి యాదవ్ కూడా సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

మెగా జాబ్‌మేళాలో 65 మంది ఎంపిక

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన మెగా జాబ్ మేళాలో 65 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. జాబ్‌మేళాకు 220 మంది ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోగా 180 మంది శుక్రవారం జరిగిన వివిధ పరిశ్రమల ఇంటర్వ్యూ లకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ గోపికృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శ్రీకాళహస్తి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం సహచర టీచర్లు సన్మానించారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కందాటి మునీశ్వర్‌రెడ్డి, మల్లెల మస్తాన్‌రావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, భాస్కరయ్య, చెంచయ్య, జయసింహ, శ్రీకర్‌రెడ్డి, ఢిల్లీబాబు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టీచర్లను సన్మానిస్తున్న సహోద్యోగులు

నారాయణవనంలో..

నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్యామలతను శుక్రవారం ఘనంగా గౌరవించారు. గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాస్థాయి అవార్డును అందుకున్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శ్యామలతకు శాలువ కప్పి గౌరవించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శశికళ మాట్లాడుతూ పాఠశాలలో అటల్ థింక్ సెంటర్, గీన్ కోర్ యూనిట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న శ్యామలత విద్యార్థుల్లో క్రియేటివిటీని పెంచడానికి కృషి చేస్తున్నారని అన్నారు. చంద్రయాన్–3 ప్రయోగంలో విద్యార్థులు తయారు చేసిన డేటా అనాలసిస్ యూనిట్ తయారీలో గైడ్‌గా వ్యవహరించి, రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు గుర్తింపును తీసుకువచ్చారన్నారు.



శ్యామలతను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

శ్రీకాళహస్తి రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గురువారం కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న తొండమనాడు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం కృష్ణయ్యను ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ బందం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అచ్యుతయ్య, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్కిట్ బ్రాంచ్ మేనేజర్ పవన్ కుమార్, పూర్వ విద్యార్థులు సుబ్బానాయుడు కండ్రిగ మాజీ సర్పంచ్ మునిరెడ్డి,వేణుగోపాల్ రెడ్డి, చంగల్రాయిరెడ్డి, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అన్నదానం

పాకాల: మండలంలో కొత్తపల్లెలోని లక్ష్మీబాయి వృద్ధాశ్రమంలో శుక్రవారం వృద్ధులకు అన్నదానం చేశారు. టీటీడీ విశ్రాంత శానిటరీ వర్కర్ రాజమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె మేనల్లుడు నరసింహులు, శోభారాణి దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

బొజ్జ గణపయ్య సేవకు వేళాయే!

బొజ్జ గణపయ్య ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. శనివారం సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ఊరూవాడా వినాయక చవితిని వేడుకగా జరుపుకోనున్నారు. ఇందుకు అవసరమైన పండుగ సామగ్రి కొనుగోళ్ల సందడి కనిపించింది. వినాయక ఉత్సవ కమిటీలు పండుగ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

- ఊరూవాడా చవితి సందడి

సత్యవేడు: వినాయక చవితి పండుగ సందడి సత్యవేడులో నెలకొంది. రోడ్లు వెంబడి, పూలు, పత్రి, చెరుకు, వివిధ రకాల పండ్లతో నిండుగా ఉంది. శుక్రవారం టవర్ క్లాక్ సెంటర్ చుట్టూ పూలు, అరటి బోదెలు, పూజా సామగ్రి అమ్మకాలు జోరందుకున్నాయి. యువకులు గణపతి విగ్రహాలను ట్రాక్టర్లపై ఎక్కించి గ్రామాలకు తరలించారు.

చవితి సందడి

శ్రీకాళహస్తి: పట్టణంలో శుక్రవారం చవితి సందడి నెలకొంది. శుక్రవారం పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున పూజాసామగ్రి కొనుగోలు చేశారు. పట్టణం నుంచే కాకుండా పలు మండలాలకు చెందిన భక్తులు పూజాసామగ్రి కొనుగోలుకు పెద్ద ఎత్తున శ్రీకాళహస్తికి తరలివచ్చారు. పట్టణమంతా కొనుగోలుదారులతో నిండిపోయింది. అరటిపిలకలు, చెరకు గడలు, ఆకట్టుకునే వినాయక ప్రతిమలు, గొడుగులు, ఔషధ పత్రులు, మొగలి తోరణాలు కొనుగోలు చేశారు.

వినాయక విగ్రహాల పంపిణీ

పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, వినాయక చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సురేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు వినాయక కమిటీలకు వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి: విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సురేంద్రకుమార్‌రెడ్డి



సత్యవేడు టవర్ క్లాక్ సెంటర్‌లో పండ్లు, పూలు విక్రయిస్తున్న వ్యాపారులు

మట్టి వినాయకులనే పూజిద్దాం

మట్టి వినాయకులనే పూజించి, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని తొట్టంబేడు తహసీల్దార్ మధుసూదన్‌రావు అన్నారు. మండల ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజించుకుందామని తెలిపారు.

మట్టి విగ్రహాల పంపిణీ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని బైరవ ఎస్టీకాలనీలో యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుని మట్టి విగ్రహాలను యువనేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండల కోఆర్డినేటర్ నాగమణి, వలంటీర్లు వెంకటేష్ స్వర్ణ, పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నాగలాపురం: వినాయక చవితి ఉత్సవాలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సింగిల్‌విండో విధానంపై అనుమతి తీసుకోవాలన్నారు. రికార్డు డాన్సులు, అశ్లీల ప్రదర్శనలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనదారులకు ఇబ్బంది లేకుండా విగ్రహాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక మండపం వద్ద కమిటీ సభ్యులు పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

వినాయక చవితికి ఏర్పాట్లు

ఏర్పేడు: మండలంలోని గ్రామాలన్నింటిలో వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయాల వద్ద ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి చలువ పందిళ్లు వేస్తున్నారు. విద్యార్థులు, యువకులు వినాయక విగ్రహాల ప్రతిష్ట కోసం గ్రామాల్లో కొబ్బరి ఆకులు, కొయ్యలతో పందిళ్లు వేస్తున్నారు.

ముందస్తు చవితి వేడుకలు

మండలంలోని పాతవీరాపురంలో ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి వేడుకలు జరిగాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు వినాయక ప్రతిమలను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, మిఠాయిలు పంపిణీ చేశారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నాథ్ లింగుట్ల, ఉపాధ్యాయులు దేవరాజులు, పద్మజ, వెంకటేశ్వర్లు, ఉషారాణి, హరి పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ

మట్టి వినాయక ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఆమందూరులో యువ సమాజ్ నిర్మాణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేశారు.

అనుమతి తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వినాయక బొమ్మలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని గ్రామాల్లో వినాయక బొమ్మల ఏర్పాట్లపై ప్రజలతోపాటు ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు.

కళకళలాడిన షాపులు

మండల కేంద్రంలోని షాపులు వినాయక చవితి పూజ సామగ్రితో కళకళలాడాయి. వినాయక పూజకు కావాల్సిన పూజ సామగ్రిని, బట్టలు, సరుకులను మండల ప్రజలు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి షాపులు కొనుగోలు దారులతో నిండిపోయాయి. యువకులు వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేశారు. వినాయకుడి దేవాలయాలు విద్యుత్ దీపాలంకరణలో కళకళలాడాయి.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: వినాయకచవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు మండల వాసులు సిద్ధమయ్యారు. మండల కేంద్రంలో పండుగ సందడి కనిపిస్తోంది. గ్రామాల నుంచి పట్టణానిగ సామగ్రిని కొనుగోలు చేసేందుకు వచ్చే జనంతో మండల కేంద్రం కిక్కిరిసిపోయింది. వినాయక విగ్రహాలను తరలించే పనిలో శుక్రవారం యువత తలమునకలైంది.



ఏర్పేడు: వినాయక స్వామికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు



బుచ్చినాయుడుకండ్రిగలో విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు